# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 21-05-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

❖ అత్యాధునిక సౌకర్యాలతో ఆధునీకరించిన 103 అమృత్ భారత్ రైల్వే స్టేషన్లను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రేపు ప్రారంభించనున్నారు.

❖ ఛత్తీస్‌గఢ్ లోని నారాయణపూర్ జిల్లాలో ఈరోజు జరిగిన ఎదురుకాల్పుల్లో 27 మంది మావోయిస్టులు మృతి చెందారు.

❖ మిజోరం దేశంలో మొట్టమొదటి పూర్తి అక్షరాస్యత సాధించిన రాష్ట్రంగా నిలిచింది.

❖ ఆయుష్మాన్ భారత్ వంటి కార్యక్రమాల ద్వారా భారత ఆరోగ్య రంగంలో పరివర్తనాత్మక పురోగతిని సాధించామని కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి పుణ్య సలీల శ్రీవాస్తవ తెలిపారు.

❖ ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 122వ సంచిక ఈ ఆదివారం ప్రసారమవుతుంది.

=============================

అత్యాధునిక సౌకర్యాలతో ఆధునీకరించిన 103 "అమృత్ భారత్ రైల్వే స్టేషన్లు" ప్రారంభోత్సవానికి సిద్ధమయ్యాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు రాజస్థాన్‌లోని బికనీర్ నుండి ఈ స్టేషన్లను ప్రారంభిస్తారు. అమృత్ భారత్ పథకం కింద నగర కేంద్రాలుగా నవీకరించిన ఈ స్టేషన్లను ప్రాంతీయ సంస్కృతి, వారసత్వాన్ని ప్రదర్శించేలా తీర్చిదిద్దారు. అదే విధంగా రైల్వేలు, రహదారులు, విద్యుత్, పునరుత్పాదక ఇంధన రంగాలకి సంబందించిన 26 వేల కోట్ల రూపాయల విలువైన బహుళ ప్రాజెక్టులను సైతం రేపు ప్రధానమంత్రి దేశానికి అంకితం చేయనున్నారు.

=============================

"అమృత్ భారత్ స్టేషన్" పథకం కింద 1,300కి పైగా రైల్వే స్టేషన్లను ఆధునీకరించేందుకు ప్రభుత్వం గుర్తించిందని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ తెలిపారు. అందులో భాగంగా మొదటి దశలో 103 అమృత్ భారత్ స్టేషన్లను అభివృద్ధి చేశామని స్పష్టం చేశారు. వీటిని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు రాజస్థాన్‌లోని బికనీర్ పర్యటన సందర్భంగా జాతికి అంకితం చేస్తారని వెల్లడించారు. ఈరోజు ఆయన ఆకాశవాణితో మాట్లాడుతూ... "అమృత్ భారత్ పథకం" మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటూ ప్రయాణీకులకు ఆధునిక సౌకర్యాలను కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలియజేస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

==============================

ఛత్తీస్‌గఢ్ లోని నారాయణపూర్ జిల్లాలో ఈరోజు ఉదయం జరిగిన ఎదురుకాల్పుల్లో 27 మంది మావోయిస్టులు మృతి చెందారు. మావోయిస్టులపై ఈరోజు జరిగిన ఆపరేషన్‌ను నక్సలిజాన్ని నిర్మూలించే పోరాటంలో ఒక మైలురాయి విజయంగా హోంమంత్రి అమిత్ షా అభివర్ణించారు. నక్సల్ ఉద్యమానికి వెన్నెముక అయిన కీలక నాయకుడు నంబాల కేశవ్ రావు అలియాస్ బసవరాజు ఈరోజు జరిగిన ఎదుకాల్పుల్లో మరణించారని అమిత్ షా సామాజిక మాధ్యమం ఎక్స్ లో పేర్కొన్నారు. ఈ నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ లో ధైర్య సాహసాలు చూపిన భద్రతా దళాలను అమిత్ షా ప్రశంసించారు. ఇక ఈ ఎన్‌కౌంటర్‌పై ప్రధానిమంత్రి నరేంద్రమోదీ ఎక్స్ వేదికగా స్పందిస్తూ... ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న భద్రతా బలగాల అద్భుత విజయాన్ని చూసి గర్విస్తున్నానన్నారు. మావోయిజం ముప్పును నిర్మూలించి.. ప్రజలకు శాంతి, పురోగతితో కూడిన జీవితాన్ని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధానమంత్రి ఈ సందర్భంగా ఉద్ఘాటించారు.

==============================

పాకిస్తాన్ ప్రాయోజిత ఉగ్రవాదాన్ని మరింత బహిర్గతం చేయడంతో పాటూ ఆపరేషన్ సిందూర్ వివరాలను వెల్లడించడానికి JD(U) పార్టీ కి చెందిన పార్లమెంట్ సభ్యులు సంజయ్ కుమార్ ఝా నేతృత్వంలోని అఖిలపక్ష ప్రతినిధి బృందం ఈరోజు 5 దేశాల పర్యటనకు బయలుదేరింది. ఇండోనేషియా, మలేషియా, రిపబ్లిక్ ఆఫ్ కొరియా, జపాన్, సింగపూర్‌ల దేశాలను ఈ ప్రతినిధి బృందం సందర్శించి ఉగ్రవాదాన్ని దాని, అన్ని రూపాల్లో ఎదుర్కోవడానికి భారతదేశపు విధానాన్ని తెలియజేస్తుంది. అలాగే శివసేన పార్టీ ఎంపీ శ్రీకాంత్ షిండే నేతృత్వంలోని మరో ప్రతినిధి బృందం ఈరోజు యుఎఇ, లైబీరియా, కాంగో దేశాల పర్యటనకు బయలుదేరనుంది.

==============================

నైరుతి పాకిస్తాన్‌లోని బలోచిస్తాన్ ప్రావిన్స్ లోని ఖుజ్దార్ జిల్లాలో ఈరోజు ఉదయం స్కూల్ బస్సుపై జరిగిన ఒక ఆత్మాహుతి దాడిలో నలుగురు పిల్లలు మృతి చెందగా మరో 38 మంది గాయపడ్డారు. గాయపడిన వారిని కంబైన్డ్ మిలిటరీ హాస్పిటల్ (సీఎంహెచ్)కు తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే ఈ దాడికి ఇంతవరకు ఏ ఉగ్రవాద సంస్థ బాధ్యత వహించకపోగా ఈ దాడి వెనుక భారతదేశ ప్రమేయం ఉందని పాకిస్తాన్ చేసిన నిరాధారమైన ఆరోపణలను భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఖండించింది. ఈ సంఘటనలో చోటు చేసుకున్న ప్రాణనష్టానికి భారతదేశం సంతాపం తెలియజేస్తుందని ఈరోజు విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. ఉగ్రవాద కేంద్రంగా ఖ్యాతిని ఆర్జిస్తున్న పాకిస్తాన్ ప్రపంచ దృష్టిని మళ్లించడంతో పాటూ సొంత వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి భారత్ పై ఇటువంటి అసత్య ఆరోపణలను చేస్తోందని విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది.

విరామం

==============================

మిజోరం దేశంలో మొట్టమొదటి పూర్తి అక్షరాస్యత సాదించిన రాష్ట్రంగా ప్రకటించబడింది. ఇది ఆ రాష్ట్ర విద్యా రంగంలో ఒక చారిత్రాత్మక మైలురాయిని సూచిస్తుందని కేంద్ర విద్యా శాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సామాజిక మాధ్యమం ఎక్స్ లో పేర్కొన్నారు. ఈ విజయానికి మిజోరం రాష్ట్ర ప్రజలను అభినందించారు.

==============================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 122వ సంచిక ఈనెల 25వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్

కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 23వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

==============================

కైలాష్ మానస సరోవర్ యాత్రకు ఈ సంవత్సరం మొత్తం 750 మంది యాత్రికులు ఎంపికయ్యారు. ఈరోజు న్యూఢిల్లీలో విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సమక్షంలో ఆన్‌లైన్ కంప్యూటరైజ్డ్ డ్రా ద్వారా ఈ యాత్రికుల ఎంపిక ప్రక్రియను నిర్వహించారు.

==============================

ఆపరేషన్ సింధూర్ ని విజయవంతం చేసిన భారత సైన్యానికి దేశ ప్రజానీకం జేజేలు పలుకుతోంది. భారత త్రివిధ దళాలకు సంఘీభావంగా ఆకాశవాణి వార్తా విభాగం ప్రత్యేక కథనాన్ని అందిస్తోంది. అందులో భాగంగా పరమ వీర చక్ర అవార్డు గ్రహీత మేజర్ హోషియార్ సింగ్ గురించి ఇప్పుడు తెలుసుకుందాం…

(వాయిస్ 30 సెకన్లు)

==============================

అందరికీ ఆరోగ్య భద్రతను కల్పించాలనే సూత్రానికి భారత్ కట్టుబడి ఉందని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ కార్యదర్శి పుణ్య సలీల శ్రీవాస్తవ పునరుద్ఘాటించారు. ఈరోజు జెనీవాలో జరిగిన 78వ ప్రపంచ ఆరోగ్య సభలో అసెంబ్లీ ప్లీనరీని ఉద్దేశించి ఆమె ప్రసంగిస్తూ… ఆయుష్మాన్ భారత్ వంటి కార్యక్రమాల ద్వారా సాధించిన పరివర్తనాత్మక పురోగతిని ప్రస్తావించారు. ఈ కార్యక్రమం సమగ్ర ఆరోగ్య సంరక్షణకు ప్రాప్యతను విస్తరించిందని, మెరుగైన మౌలిక సదుపాయాలను కల్పించిందని ప్రపంచ ఆరోగ్య సమానత్వం పట్ల భారతదేశం తన నిబద్ధతను పునరుద్ఘాటించిందన్నారు. భారతదేశం ఇటీవల ట్రకోమా రహితంగా WHO ద్వారా ధృవీకరించబడిందని పుణ్య సలీల శ్రీవాస్తవ పేర్కొంటూ…

(వాయిస్ 27 సెకన్లు)

==============================

దేశంలోని కొన్ని రాష్ట్రాలలో ఈ నెల 26వ తేదీ వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (IMD) తెలిపింది. అందులో ముఖ్యంగా ఉత్తరాఖండ్, పంజాబ్, హర్యానా, చండీగఢ్ ఉత్తరప్రదేశ్‌లలో ఉరుములు, ఈదురుగాలులు కూడిన వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ IMD వెల్లడించింది.

==============================
==============================